బైక్‌లు చోరీ చేస్తూ.. స్టంట్‌లతో ఇన్‌స్టా రీల్స్ చేస్తూ..

- ఘరానా దొంగ అరెస్ట్
- తొమ్మిది బైక్‌లు స్వాధీనం...

సనత్‌నగర్: బైక్‌లను చోరీ చేసి, వాటి నెంబర్ ప్లేట్‌ను తొలగించడం..ఆపై దొంగిలించిన బైక్‌లతో స్టంట్‌లు చేస్తూ ఇన్‌స్టాగామ్, వాట్సాప్ గ్రూపుల్లో అప్‌లోడ్ చేస్తున్న ఘరానా దొంగను బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, డీఐ మల్లేశంతో కలిసి నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని వివరాలు వెల్లడించారు. బేగంపేట పరిధిలోని స్మిత్‌పటేల్ అనే వ్యక్తి తన టీవీఎస్ జూపిటర్ బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేసి తాళం వేయడం మరిచిపోయి ఇంట్లోకి వెళ్లాడు. మర్నాడు ఉదయం బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు డీఐ మల్లేశం, ఎస్ఐ గంగాధర్, కానిస్టేబుళ్లు మహేష్, హరీష్, సతీష్, ఎండీ.మసూద్ అహ్మద్‌లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తు చేపట్టిన వారు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆధారంగా సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో నెంబర్ ప్లేట్ లేకుండా ప్రకాష్‌నగర్ వద్ద ఓ యువకుడు వాహనం నడుపుతుండడాన్ని గుర్తించారు. బేగంపేట పాటిగడ్డకు చెందిన మైనర్ బాలుడు (17)గా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా వివరాలు వెల్లడించాడు. బాలుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా చాంద్రాయణగుట్ట షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీంను అరెస్టు చేసి అతడి నుంచి తొమ్మిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. షేక్ ఇబ్రహీంను రిమాండ్‌కు తరలించిన పోలీసులు మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. ఇబ్రహీంపై సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిదిలో 3 , ఎస్ఆర్‌నగర్ పరిధిలో 2, హుమాయున్‌నగర్, రాంగోపాల్‌పేట, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్లలో ఒక్కోటి చొప్పున కేసులు ఉన్నట్లు గుర్తించారు. కేసు చేధించిన టీమ్ సభ్యులు ఎస్ఐ గంగాధర్, కానిస్టేబుళ్లు మహేష్, హరీష్, సతీష్‌లను డీసీపీ అభినందిస్తూ వారికి రివార్డులు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

స్నాప్‌చాట్‌లో వలపు వల..
మైనర్ చిక్కి విలవిల!



- బాలికను నమ్మించి 16 తులాల బంగారం, రూ.1.50 లక్షలు స్వాహా
- అర్జున్‌రెడ్డి, ప్లేబాయ్ పేర్లతో చాటింగ్
- నిందితుడి రిమాండ్




వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్, వృత్తంలో నిందితుడు

చిలకలగూడ: స్నాప్‌చాట్, ఇన్‌స్టాగామ్‌లో అర్జున్‌రెడ్డి, ప్లేబాయ్ పేర్లలో విసిరిన వలపు వలకు ఓ మైనర్ బాలిక చిక్కింది. మాయమాటలు నమ్మి తాను ఉంటున్న పెద్దమ్మ ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు కాజేసి నిందితునికి ఇచ్చింది. అనుమానం వచ్చిన పెద్దనాన్న ఆరా తీయగా నిజం బయట పడింది. బాలిక నుంచి తీసుకున్న డబ్బులతో జల్సాలు చేస్తున్న నిందితుడు విజయ్‌కుమార్‌రెడ్డిని చిలకలగూడ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం చిలకలగూడ ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌తో కలిసి ఈస్ట్ జోన్ డీసీపీ గిరిధర్ వివరాలను వెల్లడించారు.

బెంగళూర్ నుంచి తరచూ సికింద్రాబాద్‌కు..

చిలకలగూడకు చెందిన శ్రీనివాసరావు నగరంలో, అతని భార్య ఆంధ్రప్రదేశ్ జగ్గయ్యపేటలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. విజయవాడలో నివస్తున్న మరదలు సులోచన కుమార్తె (13) బాలికను తీసుకువచ్చి తన పిల్లలతో పాటు చదివిస్తున్నాడు. బాలిక స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. తల్లితో పాటు జగ్గయ్యపేటలో ఉద్యోగం చేస్తున్న పెద్దమ్మతో తరుచూ మాట్లాడేందుకు బాలికకు సెల్‌ఫోన్ ఇచ్చారు. ఏపీ, కడప జిల్లా పెంట్లిమర్రి మండలం వేలూరుపాడు గ్రామానికి చెందిన చెప్పలి విజయ్‌కుమార్‌రెడ్డి (19) బెంగళూరు యెలహంక న్యూటౌన్‌లోని బాలాజీ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. ఈ క్రమంలో స్నాప్‌చాట్‌లో అర్జున్‌రెడ్డి, ఇన్‌స్టాలో ప్లేబాయ్ పేర్లతో ఐడీలు క్రియేట్ చేసి చాటింగ్ చేస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డితో బాలికకు పరిచయం ఏర్పడింది. బెంగళూర్ నుంచి బాలిక కోసం పలుమార్లు విజయ్‌కుమార్ సికింద్రాబాద్‌కు వచ్చాడు. పరిస్థితులు గమనించిన విజయ్‌కుమార్ తన తల్లితండ్రులకు ఆరోగ్యం బాగాలేదని బాలికను నమ్మించి బాలిక ఇంట్లోని నగదుతోపాటు బంగారు ఆభరణాలు తెలివిగా చేజిక్కించుకున్నాడు. మరికొన్ని ఆభరణాలను తోటి విద్యార్థికి ఇచ్చి, వారి కుటుంబసభ్యులతో తాకట్టు పెట్టించి, వచ్చిన డబ్బును విజయ్‌కుమార్‌కు అందించింది. బాలిక నుంచి గుంజిన డబ్బులతో విజయ్‌కుమార్ మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్, బైక్ రేస్‌లతో జల్సా చేయసాగాడు. ఈ క్రమంలో బాలిక పెద్దనాన్న శ్రీనివాసరావు తన జేబులో రూ.3 వేల నగదు మాయమైనట్లు గుర్తించాడు. ఆరా తీయగా బాలికపై అనుమానం కలిగింది. భార్యతోపాటు మరదలుకు ఫోన్ చేసి చిలకలగూడకు పిలిపించాడు. ఇంట్లోని లాకర్ తెరిచి చూడగా నగదుతోపాటు పలు బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడు విజయ్‌కుమార్ బాలికతో చాటింగ్ చేస్తున్నట్లు సాంకేతిక ఆధారాలతో గుర్తించారు. ఈ నెల 15వ తేదీన నగరానికి వచ్చిన విజయ్‌కుమార్‌ను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. బాలికకు మాయమాటలు చెప్పి రూ. 1.50 లక్షలు నగదు, సుమారు రూ. 10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు కాజేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్ఐలు ఆంజనేయులు, బాలరాజు, కరుణాకర్ రెడ్డి, జగదీష్, జ్ఞానేశ్వర్, కిషోర్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

వ్యాధి నయం చేస్తామంటారు.. డబ్బులతో ఉడాయిస్తారు!

- నకిలీ ఆయుర్వేద ఔషధాల ముఠా గుట్టురట్టు
- కర్ణాటక, నాగ్‌పూర్‌కు చెందిన ముగ్గురి అరెస్టు

సనత్‌నగర్: నకిలీ ఆయుర్వేద మందులతో జనాలను మోసం చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఎస్ఆర్‌నగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎస్సార్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ వివరాలను వెల్లడించారు. నకిలీ ఆయుర్వేద ముఠాలు ముందుగా నగరంలో ఆస్పత్రులు ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటారు. కేన్సర్, పక్షవాతం, చర్మవ్యాధులు, కిడ్నీ సమస్యలు, అల్జీమర్, న్యూరో సమస్యలు, మోకాళ్ల నొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తారు. తమ బంధువులు, కుటుంబ సభ్యుల్లో ఇలాంటి సమస్యలు ఉంటే తమ వద్ద లభించే ఆయుర్వేద మందులతో వెంటనే నయం చేయడం జరిగిందని చెబుతారు. మందులు కావాలంటే నిపుణులైన వైద్యులను సంప్రదించాల్సిందిగా వారి ముఠాలోని మరొకరి ఫోన్ నెంబర్ కూడా ఇస్తారు. అది నమ్మిన బాధితులు ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా వైద్యులుగా సమాధానాలు చెబుతుంటారు. అంతేకాక వైద్యం కోసం ఇంటికే వస్తామని చెప్పి వెళ్తారు. పసుపు, కర్పూరం, యాలకులు, కొబ్బరి నూనె, ఆవ నూనె తదితర ముడి సరుకులతో చికిత్సా మార్గాలను సూచిస్తారు. కొన్ని రకాల భస్మాలతో తాము సూచించిన పదార్థాలను కలిపి ఉపయోగించడంతో వ్యాధి నయం అవుతుందని నమ్మబలికారు. ఇక భస్మాలు కావాలంటే తమకు తెలిసిన ఆయుర్వేద స్టోర్‌లలో మాత్రమే లభిస్తాయని చెప్పి అప్పటికే తాము ఏర్పాటుచేసిన నకిలీ ఆయుర్వేద మందుల దుకాణాల వివరాలను అందజేస్తారు. ఇంటికి వచ్చి చికిత్స చేసినందుకు, తమ దుకాణాల్లో మందులు కొనుగోలు చేసినందుకు లక్షల్లో బిల్లులు వసూలు చేస్తారు. చివరకు ఆ మందులు వాడిన వారు వ్యాధులు తగ్గకపోవడంతో మోసపోయామని తెలుసుకుని పోలీసులను ఆశ్రయిస్తుంటారు. ఈ క్రమంలో నకిలీ ఆయుర్వేద మందులు వాడి మోసపోతున్న బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో మధురానగర్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నకిలీ ఆయుర్వేద మందులను అంటగట్టి బాధితుల నుంచి లక్షల రూపాయలను స్వాహా చేసిన కర్ణాటక, నాగ్‌పూర్‌కు చెందిన రెండు ముఠాల్లోని ముగ్గురు సభ్యులను అరెస్టు చేశారు. మధురానగర్‌లో 3, నారాయణగూడలో 2, బేగంపేటలో 2, ఫిలింనగర్, కూకట్‌పల్లి, గోల్కొండ, ఎస్ఆర్‌నగర్, మారేడ్‌పల్లి, బోరబండ, పంజగుట్ట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కోటి చొప్పున మోసాలు వెలుగు చూశాయి. ఆయా కేసుల్లో మొత్తం రూ.19 లక్షల మేర బాధితుల నుంచి వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

'కాంగ్రెస్ హయాంలో మాదిగలకు అన్యాయం'

బౌద్ధనగర్: కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ పేర్కొన్నారు. పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ ఎంపీ స్థానాలు, కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానాల్లో ఒక్క టికెట్ కూడా మాదిగలకు కాంగ్రెస్ కేటాయించకపోవడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ద్రోహం పట్ల మాదిగలు ఆవేదనతో రగిలిపోతుంటే ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు పుండు మీద కారం చల్లినట్లుగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో నియమించిన ఉద్దండుడైన అడ్వొకేట్ ఎవరో చెప్పాలని ప్రశ్నించారు. ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో సుప్రీం కోర్టులో విచారణ జరిగితే 6వ తేదీన మంత్రి దామోదర రాజనర్సింహా నేతృత్వంలో సుప్రీం కోర్టుకు వచ్చిన బృందం ప్రెస్‌మీట్ పెట్టి వివేక్ టాంకా అనే న్యాయవాదిని తెలంగాణ ప్రభుత్వం తరుపున నియమిస్తున్నట్లు ప్రకటించారన్నారు. కానీ 7వ తేదీన జరిగిన విచారణలో వివేక్ టాంకా పాల్గొనలేదని, మరి ఎవరు వాదనలు వినిపించారో రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. అంతే కాక మందకృష్ణ మాదిగ జైలులో ఉన్నప్పుడు తానే న్యాయవాదిని పెట్టానని మాట్లాడుతున్న సీఎం రేవంత్ సదరు న్యాయవాది పేరు తెలపాలన్నారు. రెడ్డిలకు ఇచ్చిన పదవులు ఎన్నో .. మాదిగలకు ఇచ్చిన పదవులు ఎన్నో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సోమశేఖర్, డప్పు మల్లికార్జున్, విజయరావు, శివ, రఘు, రాజశేఖర్, శివప్రసాద్, సాయికుమార్, మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందు నరేష్


గులాబీ పార్టీతోనే కంటోన్మెంట్ అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

కంటోన్మెంట్: గులాబీ పార్టీతోనే కంటోన్మెంట్ అభివృద్ధి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని స్పష్టం చేశారు. బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. దివంగత ఎమ్మెల్యే సాయన్న 30 ఏళ్ల నుంచి కంటోన్మెంట్‌కు సేవలందించారని గుర్తు చేశారు. కంటోన్మెంట్ సమస్యలను ప్రస్తావించే సత్తా ఉన్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. కొందరు చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని ఈ నెల 19న నివేదిత నామినేషన్ కార్యక్రమం ఉంటుందని 20వ తేదీ నుంచి అన్ని వార్డుల్లోనూ పాదయాత్రలు మొదలవుతాయన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కంటోన్మెంట్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఏకగ్రీవానికి ఇతర పార్టీలు సహకరించాలని మల్లారెడ్డి కోరారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే ఎలాంటి లాభం లేదన్నారు. అన్నివర్గాల అభివృద్ధిని కాంక్షించే బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. రావుల శ్రీధర్ రెడ్డి, జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, లోకనాథ్, ఆకుల రూప హరి, టీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌కు బీజేపీకి ఓటేయాలి



బీజేపీలో చేరిన వారితో మర్రి శశిధర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: దేశ భవిష్యత్ కోసం బీజేపీకి ఓటేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం ఆయన బన్సీలాల్‌పేట్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీనగర్ కాలనీకి చెందిన శివశంకర్, ప్రణీల్, జితేంద్రదేవ్, చోటు, స్వామి, రేష్మ, టక్కర్, సాన్విక, మీన, రజినీ బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ..దేశ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీకి మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పాటు దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలోకి తీసుకెళ్లడానికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో కిషన్‌రెడ్డిని ఓటు తో ఆశీర్వదించాలని కోరారు. ప్రభాకర్, శ్యామ్ నాయుడు, ప్రకాష్, రఘునాథ్, సత్యనారాయణ, చంద్రపాల్‌రెడ్డి, పరమేష్, కిరణ్ పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కేంద్రంలో బీజేపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు ఎ. శ్రీనివాస్ అధ్వర్యంలో సత్యనారాయణ, శ్రీనివాస్, పరమేష్, వంశీ, హరిక్రిష్ణ, సందీప్‌రెడ్డి, చిన్నారెడ్డి, అనితా కలిసి భోలక్‌పూర్, ఐడిహెచ్ కాలనీ, క్రిష్ణానగర్ కాలనీల్లో ప్రచారాన్ని చేస్తూ కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు.

అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్

గాంధీఆస్పత్రి : అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవిస్తే వాటిని నియంత్రించే విధానం, పరిసర ప్రాంతాల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది తక్షణం ఎలా స్పందించాలి, అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, యంత్రాల వినియోగం వంటి అంశాలపై ఈ నెల 17వ (బుధవారం) ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు.

అమర్‌నాథ్ యాత్రకు మెడికల్ సర్టిఫికెట్లు జారీ షురూ

గాంధీ ఆస్పత్రిలో బుధ, శనివారాల్లో వైద్యపరీక్షలు

గాంధీఆస్పత్రి : హిమలింగాకారంలో కొలువుదీరిన ముక్కంటిని దర్శించుకునేందుకు అమర్‌నాథ్‌కు వెళ్లే యాత్రికులకు మెడికల్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ప్రారంభమైంది. మెడికల్ బోర్డు ద్వారా ప్రతి బుధ, శనివారాల్లో వైద్యపరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు తెలిపారు.

దరఖాస్తు విధానం ఇలా..

ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో గాంధీ ప్రధాన భవనం మొదటి అంతస్తులోని మెడికల్ రికార్డు సెక్షన్ (ఎంఆర్‌డీ)లో నేరుగా హాజరవ్వాలి. దరఖాస్తును పూర్తి చేసి అందిస్తే వరుస క్రమంలో వైద్యపరీక్షలు నిర్వహించి హెల్త్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారు.

చేయించుకోవాల్సిన పరీక్షలు..

వైద్యపరీక్షలకు హాజరయ్యేవారు కంప్లీట్ బ్లడ్ ప్రొఫైల్లింగ్ (సీబీపీ), ఆర్థరైటీ సెడిమెంటేషన్ రేట్ (ఈఎస్ఆర్), కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ (సీయుఈ), గ్లూకోజ్ ర్యాండమ్ బ్లడ్ సుగర్ (జీఆర్‌బీఎస్) బ్లడ్ యూరియ, సీరం క్రియేటినిన్, ఎలక్ట్రోకార్డియా గ్రామ్(ఈసీజీ), చెస్ట్ ఎక్స్‌రే నివేదికలను మెడిక్‌ల్ బోర్డుకు సమర్పించాలి. 50 ఏళ్ల వయసు పైబడినవారు పై నివేదికలతో పాటు రెండు మోకాలి (బోత్ నీస్) ఎక్స్‌రేలు జతచేయాలి. నివేదికలు పరిశీలించి, మరికొన్ని వైద్యపరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. ఈ సర్టిఫికెట్ లేకుంటే అమర్‌నాథ్ సమీపంలోని చెకింగ్ పాయింట్ల వద్ద కేంద్ర భద్రత బలగాలు యాత్రకు అనుమతించరు.

ఓయూలో రక్తదాన శిబిరం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 325 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని వివిధ కాలేజీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలను వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తాన్ని దానం చేశారు.

ఎంపీ సీట్ల కేటాయింపులో సామాజిక న్యాయాన్ని పాటించాలి



ఉస్మానియా యూనివర్సిటీ: ఎంపీ సీట్ల కేటాయింపులో సామాజిక న్యాయాన్ని పాటించాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టీఎస్ఏ) ఆధ్వర్యంలో మహనీయుల జయంతి సందర్భంగా మాదిగల వాటా కోసం మాట-సామాజిక తెలంగాణ సాధన కోసం అనే అంశం పై నిర్వహించిన సదస్సులో ఆయనతో పాటు ఎంపీ పసునూరి దయాకర్, ఓయూ అధ్యాపకులు ప్రొ.కాశీం పాల్గొని మాట్లాడారు. మాదిగలకు ఎంపీ సీట్లు కేటాయించకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అజయ్, రాధిక, సురేందర్‌మాదిగ, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేడు ఓయూలో 3కె రన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ టెక్నాలజీ కాలేజీలో నేడు (17న) నీటి చుక్కను కాపాడుకుందాం అనే నినాదంతో ఉదయం 3కె రన్, సాయంత్రం ఫ్లాష్‌మాబ్ (సామూహిక నృత్యం) నిర్వహించనున్నారు. మంగళవారం కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించిన అనంతరం ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రతి ఏటా నిర్వహించే టెక్నోస్మానియా-2024 భాగంగా జాతీయ స్థాయిలో సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. టెక్నోస్మానియాలో భాగంగా సదస్సులు, ఎగ్జిబిషన్స్, ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ చెప్పారు. కార్యక్రమంలో టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొ.శ్రీనునాయక్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.రమేష్ కుమార్, ప్రొ.బసవరావు, ప్రొ.ప్రభాకర్ రెడ్డి, ప్రొ.రాజం, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా.పరుశురామ్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.చింత సాయిలు

బంధువుల ఇంటికి వచ్చిన బాలుడి అదృశ్యం



ఆరిఫ్ అహ్మద్ ఖాన్

రాంగోపాల్‌పేట్: బంధువుల ఇంటికి వచ్చిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన తాహీరాబేగం ఇద్దరు కుమారులు వనస్థలిపురంలోని సోదరి జాకీరాబేగం ఇంట్లో ఉంటూ ఇక్కడే చదువుకుంటున్నాడు. చిన్న కుమారుడు ఆరిఫ్ అహ్మద్ ఖాన్ (16) ఇంటర్మీడియేట్ చదువుతుండగా పెద్ద కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు. ఈ నెల 15న తాండూరు నుంచి సికింద్రాబాద్‌కు వచ్చిన ఆరిఫ్ అహ్మద్ ఖాన్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం ఓ మొబైల్ ఫోన్‌తో తండ్రి రఫీక్ అహ్మద్‌కు ఫోన్‌చేసి తాను సికింద్రాబాద్‌కు చేరుకున్నానని వనస్థలిపురంలోని ఆంటీ ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. మధ్యాహ్నం ఒంటి గంటైనా బాలుడు ఇంటికి చేరుకోకపోవడంతో ఫోన్ చేసిన నంబర్‌కు తండ్రి కాల్ చేశారు. టిఫిన్ సెంటర్‌లో కలిసి ఫోన్ కావాలంటే ఇచ్చానని తాను కలకత్తా వెళుతున్నానని గుర్తు తెలియని వ్యక్తి చెప్పారు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 8712660248 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు.

8 రోజులు.. 1020 ఈ-పెట్టీ కేసులు

సనత్‌నగర్: గడిచిన వారం రోజుల్లో నార్త్ జోన్ పరిధిలో 1020 ఈ-పెట్టీ కేసులు నమోదైనట్లు డీసీపీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత వారం రోజుల్లో 1020 ఈపెట్టీ కేసులు నమోదు కాగా, కోర్టు ద్వారా 381 కేసులు పరిష్కారం జరిగాయన్నారు. ఇందులో ఆరుగురికి జైలు శిక్ష పడగా, 320 మందికి జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 15వ వరకు 24,741 ఈ-పెట్టీ కేసులు నమోదు చేయగా ఇందులో 11,705 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. ఆయా కేసుల్లో 133 మందికి జైలు, 10,638 మందికి జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు.

కార్డినల్ పూల ఆంథోనిని కలిసిన కాంగ్రెస్ అభ్యర్థులు

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ బిషప్, కార్డినల్ పూల ఆంథోనిని మల్కాజ్‌గిరి పార్లమెంటు, కంటోన్మెంట్ శాసనసభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సునిత మహేందర్‌రెడ్డి, శ్రీగణేష్ కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. మంగళవారం ఎస్పీరోడ్‌లోని బిషప్ హౌజ్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రాయ్‌డన్‌రోచ్, అల్లాడి గౌరిశంకర్, బాబురావు, నందికంటి రవి, కేక్ శ్రీను పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ అనుదీప్

చిలకలగూడ : చిలకలగూడ శ్రీదేవి సినిమా థియేటర్ సమీపంలో ఎంసీఆర్ ప్రజాసేవ అధ్యక్షుడు మ్యాకల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చిలకలగూడ సీఐ అనుదీప్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని, క్రమం తప్పకుండా ప్రతిఏటా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్న ఎంసీఆర్ ప్రజాసేవ సంస్థ ప్రతినిధులను అభినందించారు. దశాబ్దాకాలంగా పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంసీఆర్ ప్రజాసేవ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు మ్యాకల చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యాకల హన్మంతరావు, మురళీ, సంపత్, నందు, అజయ్ పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంపుపై దృష్టి సారించాలి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్ ఆదేశించారు. మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు చెందిన సెక్టోరియల్ అధికారులు, బూత్‌లెవల్ పర్యవేక్షకుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హేమంత్ కేశవ్‌పాటిల్ మాట్లాడుతూ.. తొలుత పోలింగ్ తక్కువ నమోదు అవుతున్న ప్రాంతాల్లో పర్యటించి కారణాలను విశ్లేషించి స్థానికులతో సమన్వయం చేసుకుని త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటర్లందరినీ పోలింగ్ కేంద్రాలను తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి పర్యటనలు చేయ డం ద్వారా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు లేకుండా ఉండేందుకు సెక్టోరియల్ ఆఫీసర్లు దృష్టి సారించాలని చెప్పారు. జీ.వీరారెడ్డి, ఎస్.ఎల్లారెడ్డి, వి.సమ్మయ్య, డి.సుభాష్‌రావు పాల్గొన్నారు.

ప్రచార రథాలు ప్రారంభం

సికింద్రాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం రూపొందించిన వాహనాలను సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ మంగళవారం ప్రారంభించారు. మోండా టకారాబస్తీలోని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ నివాసం నుంచి ఎన్నికల ప్రచార వాహనాలు సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్‌లకు తరలివెళ్లాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ వైఫల్యాలను ప్రజలకు వివరించే విధంగా ప్రచార రథాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఉత్సాహంగా ప్రీ గ్రాడ్యుయేషన్ డే

రసూల్‌పురా: బాలంరాయి మమతా హైస్కూల్‌లో మంగళవారం ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. ఎయిర్ ఇండియా సీనియర్ కమాండర్ శరత్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. శరత్ మాట్లాడుతూ.. చిన్నారి విద్యార్థులకు ఇది ఒక ఉత్తేజకరమైన రోజని చిన్నారుల్లో విద్య పట్ల నూతన ఉత్సాహం నింపుతోందన్నారు. కరస్పాండెంట్ ఇందిరా దేవి, బేగంపేట సీఐ శ్రీరాములు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహ్మద్‌గూడలో అగ్నిప్రమాదం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికంగా నివాసముంటున్న తుబుసుం అనే మహిళ ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆమె గృహోపకరణాలన్నీ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సామల హేమ బాధితురాలి ఇంటిని సందర్శించి పరామర్శించారు.